క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి



హైమాస్టు లైట్లను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వప్న

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాలను అభివృద్ధే లక్ష్యమని జెడ్పీటీసీ స్వప్న అన్నారు. మండల పరిధిలోని కల్బేమల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.3లక్షల జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలతో పాటు హైమాస్టు లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైపాల్, బీఆర్‌ఎస్ నాయకులు శంకర్, అరుణ్, జీవన్, సామెల్, సందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ స్థలాన్ని కాపాడండి



సీఐ ప్రవీణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలోని మల్లన్నస్వామి జాతర నిర్వహించే స్థలాన్ని కాపాడాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం సీఐ ప్రవీణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు దండు నర్సింహ, బండి హరిశంకర్ మాట్లాడుతూ గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయానికి గ్రామస్తులు అప్పట్లో 31గుంటల భూమిని కేటాయించారని గుర్తు చేశారు. అయితే ఐనోల్ గ్రామానికి చెందిన శ్రీశైలం, దేవయ్య కలిసి రికార్డుల్లో తమ పేర్లపై పాసుపుస్తకాలను సృష్టించి విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి ఆలయ స్థలాన్ని పరిరక్షించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో నాయకులు శివగౌడ్, దుర్గారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై మాక్ పోలింగ్



మాక్ పోలింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఎంఈఓ, ఉపాధ్యాయులు

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లా పరిషత్తు పాఠశాలలో మాక్ పోలింగ్(నమూనా పోలింగ్) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విధి నిర్వహణలో అధికారులు ఎలా వ్యవహరిస్తారు? ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు? ప్రజలు ఓటును ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటారనే అంశాలను ఈ సందర్భంగా విద్యార్థులు చక్కగా వివరించారు. ఎన్నికల అధికారులుగా అంబిక, రాథోడ్‌సోను, ఆకాష్, నందిని, ప్రవీణ, బాబుషా వ్యవహరించగా, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులుగా సంజన, సాయికిరణ్, సమీర్, ఏజెంట్లుగా సంతోష్, అనిత, భాగ్యలక్ష్మి చక్కని పాత్రలు పోషించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మాక్ పోలింగ్‌ను ఎంఈఓ మారుతి రాథోడ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, సంగీత, అనురాధ, రాము, ఓంకార్‌స్వామి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన

సంగారెడ్డి: ఇటీవల యువతలో పెరుగుతున్న గుండెపోటు, సంబంధిత వ్యాధులపై జెడ్పీ హాల్‌లో ఈ నెల 3వ తేదీన జెడ్పీ హాల్‌లో అవగాహన కల్పించనున్నట్లు హోప్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ రూపేష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉషాకిరణ్, కార్యదర్శి డాక్టర్ చక్రపాణి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఒత్తిడి, నిద్రలేమి, ఊబకాయం, ధూమపానం, మద్యపానం, మధుమేహం, రక్తపోటు వంటివి గుండెకు హాని చేస్తాయని తెలిపారు. వీటన్నింటికీ ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అనిల్ సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యాదవుల సంక్షేమానికి కృషి

- నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరిస్తున్న యాదవ సంఘం సభ్యులు

పటాన్‌చెరు: యాదవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ కాలనీలో ఉన్న గోకుల్ ఫంక్షన్ హాలులో పటాన్‌చెరు యాదవ సంఘం ఆధ్వర్యంలో మహిపాల్‌రెడ్డి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా శుక్రవారం అభినందనసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసినప్పుడే విజయం సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాలకు ఫంక్షన్ హాల్స్, కమ్యూనిటీ భవనాలు నిర్మించినట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని తలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, యాదవ సంఘం ప్రతినిధులు మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, నాగరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు అడ్వకేట్ జనరల్‌ను కలిసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్‌గా ఇటీవల నియమితులైన సీనియర్ అడ్వకేట్ సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అమీన్‌పూర్ అవిశ్వాసంపై హైడ్రామా

శ్రీశైలం వెళ్లిన కౌన్సిలర్లు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించాలని కొందరు కౌన్సిలర్లు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతో పాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కూడా అవిశ్వాసం కోసం సంతకాలు చేశారు. అయితే తాజాగా అధికార పార్టీ కౌన్సిలర్లు తాము అవిశ్వాసం కోసం సంతకాలు చేయలేదని మాట మార్చారు. చైర్మన్‌ను దించాలని కొందరు చేసిన ప్రయత్నాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయంశంగా మారాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు చైర్మన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. కానీ.. బీఆర్‌ఎస్ నాయకుల వత్తిళ్ల మేరకు మళ్లీ యూటర్న్ తీసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా స్థాయి నాయకులు అమీన్‌పూర్‌లో తమ పార్టీని అధికారంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే రెండు రోజుల వరకు అమీన్‌పూర్ కౌన్సిలర్ అనిరుధ్ ఆ పార్టీ వారికి మద్దతు ఇవ్వలేదు. అవిశ్వాసం నోటీసుపై సంతకం కూడా పెట్టలేదు. కానీ శుక్రవారం ఆయన సంతకాలు చేసినట్టు తెలిసింది. అయితే కౌన్సిల్‌లో బీఆర్‌ఎస్‌కు 13 మంది సభ్యుల మద్దతు ఉంది. కాంగ్రెస్ వారు ప్రవేశపెట్టిన తలపెట్టిన అవిశ్వాసానికి 16 మంది సభ్యుల మద్దతు అవసరం. మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్న మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు ఐదు మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. బీఆర్‌ఎస్ చెందిన ఇద్దరు కౌన్సిలర్లు బీఎస్పీలోకి చేరారు. బీజేపీకి నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. మొత్తం 13 మంది కౌన్సిలర్‌ల మద్దతు ఎవరికి ఉంటే వారే చైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉంది. అవిశ్వాసం నెగ్గేందుకు కావాల్సిన సంఖ్య బలం కోసం పార్టీలకు అతీతంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.

చైర్మన్‌పై అసంతృప్తి!

అమీన్‌పూర్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డిపై సొంత పార్టీ కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. అవిశ్వాసం ప్రకటించేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నానికి వారు పరోక్షంగా మద్దతు తెలుపుతున్నారు. ఏకంగా విశ్వాసం నోటీసులపై సంతకాలు పెట్టి తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. చైర్మన్‌ను మార్చేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యే కూడా తమ పార్టీ చైర్మన్‌ను కాపాడుకోవాలని కౌన్సిలర్లకు స్పష్టమైన ఆదేశాలు చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అందరినీ రెండు రోజుల క్రితం శ్రీశైలంకు తీసుకువెళ్లారు.

కాటా సుధారాణి వర్సెస్ రమేష్..!

అమీన్‌పూర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా సుధారాణి కాంగ్రెస్ నుంచి పోటీ చేయనున్నారు. అదేవిధంగా బీజేపీ నుంచి ఎడ్ల రమేష్ కూడా కౌన్సిలర్లతో మంతనాలు చేస్తున్నారు. తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నట్లు తెలిసింది.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ మాజీ ఎంపీ, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్ షెట్కార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఝరాసంగం మండల కేంద్రంలోని రాగోజీ కల్యాణ మండపంలో హైదరాబాద్‌కు చెందిన మార్క్స్ విజన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ మంత్రి చంద్రశేఖర్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ దేవదాసు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుద్రప్పపాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, డాక్టర్ గిరిజాషెట్కార్, నరేష్‌గౌడ్, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, సంగన్న, శంకరంపాటిల్, మారుతీరావు పాటిల్, మల్లికార్జున్ పాటిల్, రుద్రయ్యస్వామి, మల్లయ్యస్వామి, నరేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, మహేందర్, పెంటయ్య, లియాఖత్‌అలీ, రాజేందర్‌సింగ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఝరాసంగం(జహీరాబాద్): చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పాత పంటల జాతర కోఆర్డినేటర్ వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామంలో డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 24వ పాత పంటల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు ప్రదర్శిస్తూ ఎడ్లబండ్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చిరుధాన్యాలు పూర్తిగా కనుమరుగు అయ్యాయని వాపోయారు. రైతులు తమ పొలాల్లో చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు మాణిక్ పటేల్, బాలరాజ్, మొగులమ్మ, రాందాస్ పాల్గొన్నారు.

విద్యారంగంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి అర్బన్: విద్యారంగంపై కేంద్రానికి చిత్తశుద్ధిలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ దేశంలో మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విద్యారంగం గూర్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. విద్యకు సంబంధిత ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీ నుంచి ప్రభుత్వం 5 శాతానికి తగ్గించిందన్నారు. విద్యార్థినుల గ్రాస్ ఎన్రోల్మెంట్ 28శాతం పెరిగిందని, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43 శాతంగా నమోదైందని అనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. 2014లో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఎంతోమంది విద్యార్థినులు చదువులకు దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంపై అవలంబిస్తున్న విధానాలను ఖండించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ కేవీ జిల్లా మాజీ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 16 చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బొల్లారంలో కార్మిక సంఘాల నాయకులతో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ కార్మికులను పూర్తిగా విస్మరించారన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు రాజయ్య, శ్రీధర్‌రావు, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేందర్ పాల్గొన్నారు.

దావత్ డబ్బులు తిరిగి ఇవ్వాలన్నందుకు..

టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

జోగిపేట(అందోల్): స్నేహితులకు ఇచ్చిన విందుకు ఖర్చు అయిన డబ్బులు ఇవ్వాలని పట్టణానికి చెందిన చాపల నర్సింహులు భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో చింతకుంట మహేష్ అనే యువకుడు జోగిపేటలో ఎన్జీఓ భవనంలో ఉన్న జియో టవర్ ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చాపల నర్సింహులు మత్స్య సహకార సంఘం నుంచి వచ్చిన రూ.20వేల డబ్బులను భార్య వద్ద నుంచి తీసుకువెళ్లి ఏడుపాయల ఆలయం వద్ద బుధవారం తోటి స్నేహితులకు విందు ఇచ్చాడు. దీంతో ఇంట్లో నుంచి తీసుకువెళ్లిన డబ్బులు ఏం చేశావని భార్య నర్సింలును నిలదీయగా తన స్నేహితులతో కలిసి దావత్ చేసుకున్నామని స్నేహితుల పేర్లు చెప్పాడు. వెంటనే ఆమె మహేష్ అనే వ్యక్తికి ఫోన్ చేసి నా భర్త ద్వారా ఖర్చు చేయించిన డబ్బులను ఇవ్వాలని, లేనిపక్షంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో శుక్రవారం ఉదయం మహేశ్ టవర్‌పైకి ఎక్కి తన స్నేహితులకు చెప్పాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ మొగులయ్య పోలీసు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని కిందకు దిగాలని సూచించగా మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్‌తో మాట్లాడిన తర్వాతనే దిగుతానని చెప్పడంతో సునీల్‌ను అక్కడికి పిలిపించి మాట్లాడించారు. దీంతో యువకుడు టవర్ కిందకు దిగాడు. అనంతరం అతడిని పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం పలు కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉస్మాన్‌నగర్, బిహెచ్ఈఎల్ మ్యాక్స్ సొసైటీ,రాజ్ పుష్ప, ఏలయన్స్, ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అమీన్‌పూర్ మండల పరిధిలో...

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట్ పరిధిలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పటాన్‌చెరు రూరల్ ఏఈ మణికంఠ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని సూచించారు.

పాలకవర్గ సభ్యులకు సన్మానం



పాండురంగారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు



సన్మానం పొందిన పంచాయతీ పాలకవర్గ సభ్యులు

జహీరాబాద్ టౌన్: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో మండలంలోని మల్‌చెల్మ సర్పంచ్ పాండురంగారెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉంటానని చెప్పారు. తనను అన్ని రకాలుగా ప్రజలు ఆదరించారని, వారి ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోనని భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఝరాసంగం మండల పరిధిలోని కుప్పానగర్‌లో...

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ సర్పంచ్ లక్ష్మీబాయి, ఉప సర్పంచ్ రవితో పాటు పాలకవర్గం సభ్యులను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిలిపివేత

సదాశివపేట(సంగారెడ్డి): పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద పత్తి నిల్వలు భారీగా పెరిగినందునా ఈ నెల 7వ తేదీ వరకు పత్తి కొనుగోలును సీసీఐ వారు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ వద్ద నిల్వ ఉన్న పత్తిని తక్కువ ధరకు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాల సూచించారు. ఈ నెల 8వ తేదీ గురువారం నుంచి పత్తి కొనుగోలును ప్రారంభిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని పత్తి రైతులు గమనించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ జీవో అమలు చేయాలి

నారాయణఖేడ్: 61ఏళ్లు పైబడిన వీఆర్‌ఏలకు సంబంధించిన వారసులకు నియామకానికి సంబంధించిన జీవోను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం వీఆర్‌ఏలు ఖేడ్ తహశీల్దార్ దేవిదాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 3,797 మంది వీర్‌ఏల వారసులకు విద్యార్హతను బట్టి జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండరు క్యాడర్‌లుగా నిర్ణయించి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

◆ గంజాయి విక్రయించేవారిపై నిఘా పెట్టండి

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయించే వారిపై నిఘా పెట్టాలని, అదేవిధంగా క్రషర్ల నుంచి వచ్చే వాహనాల నుంచి డస్ట్ రోడ్డుపై పడకుండా చూడాలని డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్ పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డిని కోరారు. సీఐగా ప్రవీణ్‌రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ మహీన్‌గౌడ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బీకేఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

సంగారెడ్డి: చౌటకూర్ మండలంలోని చక్రియాల, శివంపేట, వెండికోలు, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం బీకేఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. కార్యక్రమంలో బీకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముదిగంటి శ్రీధర్‌రెడ్డి, బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందారెడ్డి, కార్యదర్శి రామకష్టారెడ్డి, మండల అధ్యక్షులు అనంతరామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నరసింహారెడ్డి, అంజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

◆ విద్యార్థినిని చితకబాదిన లెక్చరర్

హత్నూర(సంగారెడ్డి): గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కాంట్రాక్టు లెక్చరర్ తీవ్రంగా చితకబాదడంతో విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హత్నూర గురుకుల కళాశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి బ్లాక్‌బోర్డ్ పైన పరీక్షలకు సంబంధించి వివరాలు రాసినందుకు తెలుగు కాంట్రాక్ట్ లెక్చరర్ ఆగ్రహిస్తూ కర్రతో ఎడమకాలుపైన తీవ్రంగా కొట్టడంతో గాయమై రక్తం వచ్చింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ సుధాకర్ దృష్టికి విద్యార్థులు తీసుకువెళ్లినట్లు తెలిసింది. విద్యార్థిని కొట్టిన విషయమై ప్రిన్సిపాల్ సుధాకర్‌ను సాక్షి ఫోన్లో సంప్రదించగా విద్యార్థి ఏదో తప్పు చేసినందుకు కాంట్రాక్టు లెక్చరర్ హరి మందలించాడని వివరణ ఇచ్చారు.

◆ చిన్నారికి రక్తదానం

నారాయణఖేడ్: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం పొరం హంగిర్గాకు చెందిన 8నెలల వయస్సు గల చిన్నారి అనారోగ్యానికి గురికాగా కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చిన్నారికి బ్రేయి న్యూరో శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్దేశించి అందుకు అత్యవసరంగా 'బి' పాజిటీవ్ గ్రూపు రక్తం కావాలని తెలిపారు. ఆగ్రూపు రక్తం అందుబాటులో లేకపోవడంతో వాట్సాప్ గ్రూపులో దాతల సహకారాన్ని చిన్నారి కుటుంబీకులు అర్థించారు. విషయం తెలుసుకున్న అదేగ్రూపు రక్తం గల ఖేడ్ బ్లడ్ డోనర్స్ గ్రూపు సభ్యుడైన వెంకటేష్ శుక్రవారం సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి తన రక్తాన్ని దానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. దీంతో అతడికి వైద్యులు, బ్లడ్‌డోనర్స్ గ్రూపు సభ్యులు చిన్నారి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ సమ్మె నోటీసు అందజేత

జహీరాబాద్ టౌన్: ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయ సమ్మెలో కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న మహీంద్ర అండ్ మహీంద్ర, ఎంపీఐ,సీఐఈ ఆటోమోటీవ్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంకు సమ్మె నోటీసులు అందజేశారు. సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, సతీష్, నాగరాజు, బాల్‌రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

◆ పోషక ఆహారం తీసుకోవాలి

జహీరాబాద్ టౌన్: రక్తహీనత నివారణకు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని వైద్యులు నరేంద్రబాబు అన్నారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులంలో ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్స్, జమీల్, రాములు, మెడికల్ ఆఫీసర్ సర్వరాజ్, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

◆ పార్కు సుందరీకరణ పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టిన పార్కు సుందరీకరణ పనులను కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, కాలనీవాసులు విఠల్, లక్ష్మారెడ్డి, అరుణ్ సింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ ముగిసిన ప్రత్యేక శిబిరం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థి, విద్యార్థులకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కుల్కచెర్ల, కంగ్టి, జిన్నారం పాఠశాలలకు చెందిన 125మంది విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. గత నెల 24 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహించారు. కౌమార దశలో విద్యార్థిని, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చదువుపై శ్రద్ధ పలు విషయాలపై అవగాహన కల్పించారు.

◆ ఉపాధిహామీ కూలీల సంబరాలు

సంగారెడ్డి టౌన్: జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ప్రారంభమై 18 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిధిలోని పసల్వాదిలో సంగారెడ్డి ఎంపీడీఓ రవీందర్ గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీలతో కలిసి శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్నూర మండలం నస్తీపూర్‌లో...

హత్నూర(సంగారెడ్డి): జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ప్రారంభమై 17 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలం నస్తీపూర్ గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం కూలీలు శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఈసీ ప్రమోద్ కుమార్, టీఏ ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు వీఓఏ ప్రవీణ్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

◆ ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 3వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో నిర్వహించనున్న వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక అధికారుల పాలనపై సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు.